క్లుప్తంగా

కేజీబీవీకి విరాళం

పుట్టపర్తి: బుక్కపట్నం కస్తూర్బా బాలికల పాఠశాలలో గ్రైండర్ కొనుగోలుకు పుట్టపర్తికి చెందిన స్నేహలత ఫౌండేషన్ ప్రతినిధి తలమర్ల సంజీవరెడ్డి ఆదివారం రూ.10 వేల చెక్కును విరాళంగా అందించారు. ఫౌండేషన్ సభ్యులతో కలిసి పాఠశాల ఎస్‌ఓ సౌజన్యకుమారికి చెక్కు అందజేశారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు సంజీవరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



బుక్కపట్నంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి: గతంలో బుక్కపట్నంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నెరవేర్చారని సర్పంచ్ నాగలక్ష్మి తెలిపారు. 25 సంవత్సరాల కిందట వేసిన ఐరన్ స్తంభాలు తుప్పు పట్టడంతో వాటిని తొలగించామన్నారు. వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ట్రాన్స్‌కో, పంచాయతీ సిబ్బంది చేస్తున్న పనులను సర్పంచ్ పర్యవేక్షించారు.

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీ ఎంపిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ధర్మవరం అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీని ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మనోహర్ గుప్త, అధ్యక్షుడిగా తల్లం నారాయణ మూర్తి, కార్యదర్శిగా చిన్నప్ప, కోశాధికారిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా జింక చిన్నప్ప, సహాయ కార్యదర్శిగా మంజునాథ్ ఎన్నికయ్యారు. అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, జయరామప్ప, కార్యదర్శి గంగిరెడ్డి సమక్షంలో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడొచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ధర్మవరం అధ్యక్షుడు డాక్టర్ నరసింహులు, కార్యదర్శి శివయ్య, కోశాధికారి సత్యనిర్ధారణ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆనాటి హృదయాల ఆనంద గీతం ఇదేలే!



గురువులతో పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి: వారు కలిసి 47 ఏళ్లు గడిచాయి. మరి ఇంత సుదీర్ఘ విరామం తరువాత కలవడం ఎంత మధురంగా ఉంటుందో వారిని చూస్తేనే తెలుస్తుంది. బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో 10 తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అప్పటి గురువులు రాచంరెడ్డి ఆదినారాయణరెడ్డి, మహ్మద్‌అలీ, జబ్బార్, ఓబిరెడ్డి, చంద్రశేఖర్, రామాంజనేయులు, గాయత్రీ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు బయారెడ్డి, నాగభూషణ, చింతా గంగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ మల్లికార్జున రెడ్డి, లాయర్లు ప్రభాకర్‌రెడ్డి, పత్తి శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మునెయ్య మాట్లాడుతున్న తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు విద్యాబుద్ధులు చెప్పి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుతారని తెలిపారు. కార్యక్రమంలో బాల, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు జగదీశ్వర్, అబ్దుల్ రహిమాన్, ఉపాధ్యాయుడు ఇసాక్, పీడీ నాగరాజు పాల్గొన్నారు.



ధర్మవరం: రోడ్డును శుభ్రం చేస్తున్న దృశ్యం



పుట్టపర్తి అర్బన్: పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ



ముదిగుబ్బ: రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న స్టేషన్‌మాస్టర్

‘స్వచ్ఛత’తో ఆరోగ్యం

ధర్మవరం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ, ఏక్ తారీక్ ఏక్ గంట కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది తదితరులు చీపురు పట్టుకుని చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో సర్పంచ్ పంచరత్నమ్మ, ఎంపీడీఓ శకుంతల ఎంపీటీసీ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో రోడ్డును శుభ్రం చేశారు. స్వచ్ఛ భారత్ మండల రీసోర్స్ కో-ఆర్డినేటర్ విశ్వేశ్వర, పంచాయతీ కార్యదర్శులు వసుంధర, రమణప్ప నాయుడు, గోపీనాథ్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మొటుకుపల్లిలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మండల స్పెషలాఫీసర్ సుబ్బారావు, డివిజనల్ పంచాయతీ అధికారి అంజనప్ప, సర్పంచ్ రూప తదితరులు శ్రమదానం చేశారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని సామాలగొంది పంచాయతీలో ఆదివారం సచివాలయ కార్యదర్శి మదన్‌మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ‘స్వచ్ఛతా హీ సేవా’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణ, పరిసరాలు, నీటి ట్యాంకు పరిసరాల్లోని చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు వైవి శంకర్‌నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున, వలంటీర్లు మేకలశివప్రసాద్, ఆంజనేయులు, రమణప్ప, శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌నాయుడు, రామనర్సు నాయుడు, సిద్దప్ప, వెంకటనర్సు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మన చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని ఈఓఆర్డీ దివాకర్, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని బత్తలపల్లి తండాలో సత్యసాయి జిల్లా లీడ్ బ్యాంక్‌మేనేజర్ రమణకుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ మధుసూదన్ పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిధిలోని మారల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శ్రమదానం చేశారు. పంచాయతీ, సచివాలయ సిబ్బందితో కలసి ఎంపీడీఓ శ్రీనివాసులు చెత్త వాహనాన్ని నడిపారు.

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని నిడిమామిడిలో జిల్లా పశువైద్యాధికారి శుభదాస్ ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది రోడ్డు శుభ్రం చేశారు. కార్యాలయం ఎదుట గడ్డి తొలగించారు. వెంగళమ్మచెరువులో మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రోడ్లు ఊడ్చే కార్యక్రమం చేపట్టారు. దిగువచెర్లోపల్లిలో సర్పంచ్ కామాక్షమ్మ, పెడపల్లిలో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.

పుట్టపర్తి అర్బన్: ప్రతి ఉద్యోగి తాను పని చేస్తున్న కార్యాలయం నుంచే స్వచ్ఛతా కార్యక్రమాలు మొదలు పెట్టాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆదివారం ఉదయం ఆర్డీఓ కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

తనకల్లు: మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీత, బీజేపీ మైనారిటీ మోర్చా అధ్యక్షుడు బాబ్జాన్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పలువురు నాయకులు, అధికారులు శ్రమదానం చేపట్టారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులు, సిబ్బంది చెత్తా, చెదారాన్ని తొలగించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, పరిసరాల శుభ్రతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీతా, బీజేపీ నాయకులు బాబ్జాన్, కొసెట్టి రామ్మోహన్, రమణ, సలీం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో..

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్, యూనియన్ నాయకులు స్వచ్ఛతా మీ సేవ, ఏక్ తారీఖ్ ఏక్ గంట కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో చీపురు పట్టి చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశులు, ఏడీసీలు సాహెబ్బీ, దుర్గాప్రసాద్, నరసింహులు, సిస్టమ్ సూపర్‌వైజర్ సుధాకర్, ఎంప్లాయీస్ యూనియన్ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, రీజనల్ నాయకులు నరసింహులు, నాయకులు కుమార్, సుమోశీన, రామకృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆవరణలో..

గ్రంథాలయాధికారిణి అంజలి మొక్కలు నాటారు. రైల్వేస్టేషన్ ఆవరణాన్ని రైల్వే ఎలక్ట్రికల్ ఇంజనీర్ వీరయ్య, స్టేషన్ మాస్టర్ నరసింహనాయుడు, బీజేపీ నాయకులు అంబటి సతీష్, ఓబిలేసు, జింకా చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, రైల్వే అధికారులు రైల్వేస్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

తలుపుల: స్వచ్ఛత కోసం ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ కే.శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శకుంతల, ఈఓ మాధవరెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి సర్పంచ్ లక్ష్మీదేవి పరిసరాలను శుభ్రం చేశారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో స్టేషన్ మేనేజర్ నాగభూషణ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించారు.

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవలో కార్యక్రమంలో డీఎల్‌డీఓ శివారెడ్డి పాల్గొన్నారు. పరిశుభ్రత - ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, సర్పంచ్ నారాయణ, కార్యదర్శులు వెంకటరాముడు, రమణ పాల్గొన్నారు.

రామగిరి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ నారాయణస్వామి ఆధ్వర్యంలో అధికారులు శ్రమదానం చేశారు. రామగిరిలోని కేజీబీవీలో ప్రిన్సిపాల్ సౌమ్య ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు.



గాండ్లపెంట మండలం సామాలగొంది గ్రామంలో..



నల్లచెరువు మండలం యర్రగుంట పల్లిలో ర్యాలీ



కదిరి మండలం మొటుకుపల్లిలో శ్రమదానం చేస్తున్న మండల స్పెషలాఫీసర్ సుబ్బారావు



బత్తలపల్లిలో స్వచ్ఛతా హీ సేవ..



కనగానపల్లి మండలం ముక్తాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్‌డీఓ శివారెడ్డి



ఎన్పీకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలి. 2024 ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బండ్లపల్లి, బైరాపురం, పోతులకుంట, లోచర్ల, గ్రామల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి చెందుతుండంటే అది ఒక జగన్‌తోనే సాధ్యమన్నారు. పేదలకోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి కుల, మత పార్టీలకు అతీతంగా అందించడం జరిగిందన్నారు. ఈ పథకాలును విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేయడంతో మన ప్రాంత ప్రజలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కొత్తచెరువు మండలంలో జగనన్న కాలనీల్లో అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. టీడీపీ హయంలో పేదలకు ఇచ్చిన పట్టాలను అమ్ముకొన్న ఘనత వారికే చెందుతుందన్నారు. నేడు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోందన్నారు. బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, ఆర్బీకేలు, సచివాయలయాలు, నాడు- నేడు కార్యక్రమంతో పాఠశాలల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయడమే మన లక్ష్యమన్నారు. పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, నాయకులు రెడ్డప్పరెడ్డి, మటన్‌శంకర్, మహబూబ్‌బాషా, రూప్లానాయక్, సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పారెడ్డి, నంజిరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ మున్వర్, ఎంపీటీసీ సూరి, రాజారెడ్డి, రామచంద్ర, గోవిందరెడ్డి, చెక్కీరప్ప, మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, శివారెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, యోగానందరెడ్డి, అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు, నారాయణస్వామి, అశ్వర్థరెడ్డి, డీలర్‌రాజారెడ్డి, షాన్‌షేట్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ఎమ్మెల్యే తోపుదుర్తి

కనగానపల్లి: తోపుదుర్తి ట్రస్టు సహకారంతో పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మామిళ్లపల్లిలో తోపుదుర్తి ట్రస్టు ఆధ్వర్యంల్లో చేపట్టిన ఉచిత బోరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అన్నదాతల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. వైఎస్సార్ జలకళ కార్యక్రమం కింద ఇప్పటికే నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేయించిందన్నారు. మిగిలిన రైతులకు తోపుదుర్తి ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే తన సొంత నిధులతో బోర్లు వేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, యూత్ కన్వీనర్ అశోక్, మండల నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, లాయర్ నల్లప్ప, పెద్దిరెడ్డి, స్థానిక సర్పంచ్ ఓబిరెడ్డి, నాయకులు భాస్కరరెడ్డి, అంకె తిరుపాలు, నాగప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.



బోరు వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

చెన్నేకొత్తపల్లి: అధైర్యపడొద్దు అండగా ఉంటామని రాప్తాడు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం ఓబుళంపల్లి గ్రామంలో పాముకాటుతో మృతి చెందిన మైలారపు ఆదినారాయణమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవింద రెడ్డి, సర్పంచ్ చెన్నారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రా రెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, రఘునాథరెడ్డి, కిష్టప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

అమడగూరు: మండలంలోని వివిధ పంచాయతీల్లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు చినగానిపల్లి ఆర్బీకే, 9 గంటలకు అమడగూరు సచివాలయం, 10:30 గంటలకు కస్సముద్రం సచివాలయం, 11:30 గంటలకు మహమ్మదాబాద్ సచివాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

కేబుల్ చోరీపై ఫిర్యాదు

నల్లచెరువు: గత నెల 28వ తేదీన ఉప్పార్లపల్లి గ్రామంలో పంచాయతీకి చెందిన కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తలమర్లవాండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి రమణప్పనాయుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. బోరు మోటారు మరమ్మతులకు గురికావడంతో గత నెల 28వ తేదీన బోరు బావిలోని 16 పైపులు, 110 మీటర్ల కేబుల్‌ను బయటకు తీశారు. పైపులు, కేబుల్‌ను అక్కడే ఉంచి.. మోటార్‌ను రిపేరీ చేయించుకుని వచ్చేందుకు నల్లచెరువుకు తీసుకెళ్లారు. మోటారుకు మరమ్మతులు చేయించి బోరు బావి వద్దకు తీసుకెళ్లగా.. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ దొంగిలించారు.

రామాలయానికి విరాళం



పింఛన్ మొత్తాన్ని విరాళంగా అందజేస్తున్న లబ్ధిదారులు

నల్లమాడ: మండలంలోని సోమగుట్టపల్లిలో రామాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారులు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. 45 మంది తమ పింఛన్ మొత్తాన్ని రామాలయానకి అందజేయడం హర్షణీయమని గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల కన్వీనర్ చిన్నాదేవి తెలిపారు. యేడాది క్రితం కూడా పింఛన్‌దారులు రామాలయ నిర్మాణానికి పెద్ద మొత్తంలో విరాళం అందించారన్నారు. అనంతరం పింఛన్‌దారులను గ్రామస్తులు అభినందించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

బత్తలపల్లి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టినట్లు జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. ఆదివారం బత్తలపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కోటి సుధ వారితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి అందరి వివరాలు సేకరిస్తున్నారా, ఎవ్వరినీ మిస్ చేయకుండా అందరికీ పరీక్షలు చేయాలని సూచించారు. అనంతరం ప్రజలకు స్వయంగా బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. కాలనీలో గౌతమ బుద్ధ హరిత వికాస వృద్ధాశ్రమం, సంక్షేమ కేంద్రంలో ధర్మవరం రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

700 కిలోల బియ్యం వితరణ



సేకరించిన బియ్యాన్ని చూపుతున్న విద్యార్థులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని బ్రిలియంట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు అనాథలకు సాయం చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఆదివారం పాఠశాల కరస్పాండెంట్ సీపీ శేషు, ఉపాధ్యాయులు మాట్లాడారు. అనాథలకు ఆదుకునేందుకు ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులతో పిడికెడు బియ్యం తీసుకొని పాఠశాలలో ఇవ్వడం జరిగిందన్నారు. ఇలా విద్యార్థుల నుంచి సేకరించిన 700 కిలోల బియ్యాన్ని అన్నదానం కోసం షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీకి అప్పగించడం జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: ప్యాయలవాండ్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాయలవాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు వ్యక్తిగత పని నిమిత్తం ఆదివారం ద్విచక్ర వాహనంలో కదిరికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్యాయలవాండ్లపల్లి సమీపంలోకి రాగానే కర్ణాటక రాష్ట్రం నుంచి కదిరి వైపు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అతడ్ని 108లో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



వెంకట శివారెడ్డి



పి.కిష్టప్ప

ప్రశాంతి నిలయం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీ వైఎస్సార్ టీఎఫ్ పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీపీ రమణారెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండల నూతన వైఎస్సార్ టీఎఫ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా టీ.సావిత్రమ్మ, అధ్యక్షుడిగా కె.వెంకటశివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.కిష్టప్ప, కోశాధికారిగా వై.అరుంధతి, ఉపాధ్యక్షులుగా పి.మంజుల, పి.శ్రీలత, సి.రమేష్, కార్యదర్శులుగా పి.పద్మావతి, సి.రవిచంద్ర రెడ్డి, రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్లుగా ప్రకాష్, రెడ్డి, గోవింద్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, ఉమాబాయిని ఎన్నుకున్నారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ టీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజగోపాల్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



తనకల్లు: సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న వీఆర్వోలు



ఓడీచెరువు తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులను ఆర్డీఓ తిప్పేనాయక్ సన్మానించారు. భారతదేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో గణనీయమైన పాత్రను పోషించిన వృద్ధులు రామలక్ష్మమ్మ, శంకర ఎర్రమ్మను సన్మానించారు. కార్యక్రమంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఖతిజున్‌కుబ్రా, తహసీల్దార్ యుగేశ్వరి దేవి పాల్గొన్నారు.

అమడగూరు: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఓడీచెరువు తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధ ఓటర్లను సన్మానించినట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన వయో వృద్ధులు జయన్న, లింగన్న, పెద్దన్న, బాషాను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఈశ్వర్, వీఆర్‌ఓలు శ్రీలత, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 80 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు మహేష్, మనోహర్ పాల్గొన్నారు.

నల్లమాడ: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గోపేపల్లి తండాలో హస్లీబాయిని డిప్యూటీ తహసీల్దార్ (రీసర్వే) ఎంఎస్ మల్లికార్జున పూలమాల వేసి సత్కరించారు. బీఎల్‌ఓలు మాలిక్, శారద, వీఆర్‌ఓలు లక్ష్మినారాయణ, పెద్దన్న పాల్గొన్నారు.

రామగిరి: తహసీల్దార్ కార్యాలయంలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లు బండారు లింగన్న, సంజీవమ్మను తహసీల్దార్ నారాయణస్వామి సన్మానించారు.

విద్యార్థిని కిడ్నాప్‌పై కేసు నమోదు

ఎన్పీకుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థినిని ధర్మవరానికి చెందిన దాసరి వెంకటేష్ కిడ్నాప్ చేసినట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం సాయంత్రం తన కుమార్తెను (9వ తరగతి విద్యార్థిని) దాసరి వెంకటేష్ ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడని తండ్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.